
సీత్లా పండగలో మేయర్ పారిజాతారెడ్డి

ఘనంగా బంజారాల సీత్లా వేడుకలు

సరూర్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బంజారాలు సంప్రదాయబద్ధంగా జరుపుకునే సీత్లా పండగను ఆదివారం అల్మాస్‌గూడలోని తిరుమలానగర్‌కాలనీలో స్థానిక బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి హాజరై బంజారాలతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని, బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు ఎదుళ్ల ప్రతాప్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, రామిడి కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, వినోద్‌నాయక్, ధన్సిక్‌నాయక్, బాలాజీ, రవిసింగ్, రమేశ్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చంపాపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆకుతోటపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హస్తినాపురం డివిజన్‌లోని పూజా బంకెట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో పనిచేసి ఇటీవల మృతి చెందిన వసంతరెడ్డికి వారు ఘనంగా నివాళులు అర్పించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూత అందించాలని వారు తీర్మానించారు. కార్యక్రమంలో వీరేశ్‌గౌడ్, వీ.శ్రీను, సంతోష్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, ప్రసాద్, రాజశేఖర్, నర్సింహగౌడ్, అల్లాజీ, బాలస్వామి, రోహిణి, ప్రభావతి, శోభ, వనజ, ఊర్మిళ, పద్మ, విజయలక్ష్మి, వెంకటమ్మ, ఉమాదేవి, శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.


చెక్కును బాధితుడికి అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిది

ఎల్‌బీనగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ భాగ్యనగర్‌కాలనీకి చెందిన సత్యం కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆస్పత్రి బిల్లులతో కార్పొరేటర్ ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోవడంతో రూ.30వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును ఆదివారం బాధితుడు సత్యంకి కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రోహిత్, నరేందర్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న అందెల


కుటుంబ సభ్యులతో కలిసి మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని ఆదివారం బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సత్కరించి అర్చనలు చేయించారు. అనంతరం అందెల మాట్లాడుతూ ఈ ఏడాది బోనాల పండుగను భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.


నూతనంగా ఎన్నికైన ఏవీ నగర్-2 కాలనీ కార్యవర్గ సభ్యులు

ఏవీనగర్-2కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఏవీ నగర్-2 నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రవిగుప్తా, ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా బొడ్డుపల్లి వెంకట్, సంయుక్త కార్యదర్శులుగా సురేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాంప్రసాద్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా శివప్రసాద్, మోహన్‌రెడ్డి, శంకర్, రాజుగౌడ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రామును ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ పూజారి వరదాచార్యులుతో పాటు రామనాథం, అనీల్‌దిపా, జహంగీర్ పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన పద్మావతికాలనీ కమిటీ సభ్యులు

పద్మావతికాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పద్మావతికాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కంచర్ల విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బీ.భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా తిరుమల శ్రీనివాసులు, కాసుల నర్సింహారెడ్డి, కోశాధికారిగా వై. పద్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం. రఘునాథరెడ్డి, టీ. మహేష్, సహాయ కార్యదర్శులుగా వై. సత్యనారాయణ, ఎం. జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా టీ.శ్రీకాంత్, రవి, చంద్రశేఖర్, నర్సింహ, రాజు, దేవేందర్‌నాయక్, మహిపాల్‌రెడ్డి, కరణ్‌జిత్‌సింగ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటక ప్రదర్శన


బాలనాగమ్మ నాటక ప్రదర్శనలో కళాకారులు

వనస్థలిపురం: శ్రీవినాయక నాట్యమండలి సురభీ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన బాలనాగమ్మ నాటక ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సురభీ నాటక నిర్వాహకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ఆశాఢమాసాన్ని పురస్కరించుకుని ప్రదర్శించిన నాటకోత్సవాలు ఆహుతులను ఆనందింపజేయడం హర్షణీయమన్నారు.

‘గ్రేటర్’లో విలీనమా.. ఎన్నికలా..!?

- ప్రభుత్వ ప్రతిపాదనతో మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న సందిగ్ధత
- ఆశావహ నేతల్లో నైరాశ్యం
- బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో ఇదీ పరిస్థితి

సరూర్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల తర్వాత పదవీకాలం ముగియనున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక గ్రేటర్‌లో కలిపేస్తారా? అన్న సందిగ్ధత కొనసాగుతోంది. జీహెచ్‌ఎంసీని మరింత విస్తరించి, రెండు లేదా నాలుగు జోన్లుగా విభజించనున్నారనే ప్రచారం నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ డౌటే అని పరిశీలకులు అంటున్నారు. దాంతో ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలిచి సొంత ప్రాంతంలో రాజకీయ ప్రాబల్యం చాటుకోవాలనుకున్న నాయకులు(ఆశావహులు) తీవ్ర నిరాశానిస్పృహల్లో పడిపోయారు. శివారు కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిన నేపథ్యంలో.. తమ కార్పొరేషన్లు సైతం గ్రేటర్‌లో విలీనం కావడం ఖాయమని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన అధికారులు, అఖిలపక్ష నేతలు పేర్కొంటున్నారు. దాంతో తాజా కార్పొరేటర్లు, గతంలో పోటీ చేసి ఓడిపోయి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న నేతలు, కొత్తగా పోటీలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న ఆశావహుల ఆశలపై ‘విలీనం’ నీళ్లు చల్లినట్టయింది.

అయోమయంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు..!

మీర్‌పేట్ కార్పొరేషన్ వైశాల్యంపరంగా చిన్నదే అయినా ఇక్కడ డివిజన్ల సంఖ్య ఏకంగా 46గా ఉండడం గమనార్హం! ఒక్కో డివిజన్‌లో ఓటర్ల సంఖ్య కేవలం 1500 నుంచి 2000లోపే ఉండడం మరో విచిత్రం..!! ఒక రకంగా చెప్పాలంటే పంచాయతీ వార్డు సభ్యుడికి, ఎంపీటీసీ సభ్యుడికి ఉండే ఓటర్ల సంఖ్యే అది. 2019లో మీర్‌పేట్ మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చి ఏకంగా 46 డివిజన్లుగా విభజించారు. కేవలం 80వేల పైచిలుకు ఓట్లు ఉన్న మీర్‌పేట్‌ను ఇష్టానుసారంగా 46 డివిజన్లుగా విభజించడం అప్పట్లోనే తీవ్ర విమర్శలకు తావిచ్చింది. దాంతో 2020 జనవరిలో జరిగిన ఎన్నికల్లో 46మంది కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. అనంతరం మరో ఐదుగురు కోఆప్షన్ సభ్యులను నియమించుకున్నారు. ఇక బడంగ్‌పేట్‌లో దాదాపు 93వేల మంది ఓటర్లు ఉండగా అక్కడ 32 డివిజన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు 2500 నుంచి 3500 వరకు ఓటర్లను కేటాయించారు. ఇక్కడ 32 మంది కార్పొరేటర్లకు తోడు మరో ఐదుగురు కోఆప్షన్ సభ్యులు సైతం ఎన్నుకోబడ్డారు. దాంతో రెండు కార్పొరేషన్లలో కలిపి మొత్తం 78 మంది కార్పొరేటర్లు, పది మంది కోఆప్షన్ సభ్యులు.. వెరసి మొత్తం 88మంది పదవుల్లో ఉన్నారు. వీరంతా ప్రస్తుత ప్రభుత్వం చేసిన విలీనం ప్రతిపాదనతో అయోమయంలో పడిపోయారు.

ముందు ఒకటే.. ఆ తర్వాతే రెండుగా విభజన..!

వాస్తవానికి 2019లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మీర్‌పేట్, జిల్లెలగూడ, బడంగ్‌పేట్‌లను కలిపి ‘బడంగ్‌పేట్’ పేరుతో ఒకే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిని స్వయానా అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో బహిరంగంగా ప్రకటించారు. అయితే అనంతరం జరిగిన స్థానిక నాటకీయ(రాజకీయ) పరిణామాల నేపథ్యంలో మీర్‌పేట్, జిల్లెలగూడలను కలిపి ‘మీర్‌పేట్’ పేరుతో ఒకటి, ‘బడంగ్‌పేట్’ పేరుతో మరొకటి కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశారు. ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేసి మొత్తం 40కి మించకుండా డివిజన్లు ఏర్పాటు చేస్తే బాగుండేదని, కానీ అప్పటి కొందరు నేతలు తమ అనుచరగణానికి రాజకీయ ఉపాధి కల్పించే ఉద్దేశంతోనే రెండు కార్పొరేషన్లు ఏర్పాటు చేయించి, 78 డివిజన్లుగా విభజింపజేశారనే విమర్శలు ఉన్నాయి.

‘గ్రేటర్’లో కలిపితే 7 లేదా 8 డివిజన్లు..!

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లను గ్రేటర్‌లో విలీనం చేస్తే ప్రస్తుతం ఉన్న 78 డివిజన్ల స్థానంలో కేవలం ఏడు లేదా ఎనిమిది డివిజన్లు మాత్రమే ఏర్పాటయ్యే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం గ్రేటర్‌లో 30వేలు మొదలుకుని 60వేల ఓటర్లు ఉన్న డివిజన్లు ఉన్నాయి. కొత్తగా విలీనం ప్రక్రియ జరిగితే.. రమారమి ఒక్కో డివిజన్‌కు 25వేల నుంచి 30వేలకు మించకుండా ఓటర్లు ఉండేలా ప్లాన్ చేస్తున్నట్టు స్థానిక అధికారుల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో కలిపి దాదాపు 2.25లక్షల మంది ఓటర్లు ఉన్నట్టు అంచనా. ఆ లెక్కన ఒక్కో డివిజన్‌కు 25వేల నుంచి 30వేల ఓటర్లను కేటాయిస్తే 7 లేదా 8 డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అంటే గతంలో 78మంది కార్పొరేటర్లు ఉన్న రెండు కార్పొరేషన్లలో కలిపి.. అవి గ్రేటర్‌లో విలీనమైతే కేవలం ఏడెనిమిది డివిజన్లకే పరిమితమయ్యే అవకాశముంది. దాంతో 70 మంది కార్పొరేటర్లు రాజకీయ నిరుద్యోగులుగా మిగిలిపోయే పరిస్థితి తలెత్తనుంది.

పోటీపై నేతల వెనకడుగు..?!

రెండు, మూడు వేల మంది ఓటర్లతో ఏర్పడిన డివిజన్లలో పోటీ చేసి పదో పరకో ఖర్చుపెట్టి గెలిచిన వాళ్లు, మరోసారి అదే పరిస్థితి ఉంటుందని అనుకున్న వాళ్లు.. ప్రస్తుతం వెనకడుగు వేస్తున్నారు. 25 వేల నుంచి 30 వేల మంది ఓటర్లు ఉండే డివిజన్లలో పోటీ చేసి పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టే ఆర్థిక స్థోమత తమకెక్కడిదని అప్పుడే నిట్టూరుస్తున్నారు. కేవలం పెద్ద తలకాయలు మాత్రమే పోటీ చేసే అవకాశమున్న నేపథ్యంలో ప్రస్తుతం మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో రాజకీయం దాదాపుగా చల్లబడిపోయింది. ఎవరిని కదిలించినా.. ‘అమ్మో మాతో కాదు’ అని చేతులెత్తేస్తున్నారు. ఆశావహులందరూ నిరాశా నిస్పృహలతో కనిపిస్తున్నారు. మరి.. విలీనం ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయన్నది వేచి చూడాల్సిందే..!

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : ఎంపీ ఈటల


ఎంపీ ఈటలకు గదను బహూకరిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు మంజూరు చేయించి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీలక్ష్మీకన్వెన్షన్‌లో శనివారం రాత్రి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రతినిధులు ఎంపీ ఈటలను సన్మానించగా కార్పొరేటర్ ఆయనకు గదను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయం మల్కాజిగిరి ప్రజలకు అంకితం అని అన్నారు. తనపై ఉంచిన ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధితో పాటు వారి కష్టాలలో భాగం పంచుకుంటానన్నారు. డివిజన్ అభివృద్ధి కోసం కార్పొరేటర్‌తో కలిసి పని చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంపీగా ఈటల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలతో పాటు కాలనీ సంఘాల ప్రతినిధులు ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీకి కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. సమావేశంలో బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

‘దళారులతో డ్రాగన్ ఫ్రూట్స్ రైతులకు తీవ్ర అన్యాయం’



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాటా సింగారంలోని పండ్ల మార్కెట్‌లో లైసెన్స్ లేని దళారులతో డ్రాగన్ ఫ్రూట్స్ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్, డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఎన్టీఆర్‌నగర్‌లోని మార్కెట్ కమిటీ ఉద్యోగుల భవనంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి బాటాసింగారం మార్కెట్‌కు ప్రతీ రోజు రైతులు పెద్ద ఎత్తున డ్రాగన్ ఫ్రూట్స్ తీసుకువస్తున్నారని, మార్కెట్ వద్ద ఎలాంటి రసీదులు లేకుండా కొందరు 4 శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం డ్రాగన్ ఫ్రూట్స్ రైతులు తమ సమస్యలను వివరిస్తూ మార్కెట్ కార్యదర్శి చిలుకా నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి అనిల్‌కుమార్, దామోదర్ పాల్గొన్నారు.

చాణక్యపురికాలనీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే సబితారెడ్డి హామీ


చాణక్యపురికాలనీవాసులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ రెవెన్యూ పరిధిలో గల చాణక్యపురి కాలనీవాసులు ఎదుర్కొంటున్న జోన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి హామీ ఇచ్చారు. చాణక్యపురి కాలనీవాసులు రెండు దశాబ్దాలుగా రెసిడెన్షియల్ జోన్ సమస్యను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. అప్పట్లో పలుమార్లు కాలనీవాసులు అప్పటి మంత్రి సబితారెడ్డిని కలిసి తమ సమస్యను ఏకరువు పెట్టారు. వారికి న్యాయం చేస్తానని ఆమె అప్పట్లోనూ హామీ ఇచ్చారు. అయినా నేటికీ సమస్య అలాగే కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆదివారం చాణక్యపురి కాలనీవాసులు తమ సైట్(వెంచర్)లో ఏర్పాటు చేసిన సమావేశంలో సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు గుండవరం వేణుగోపాల్‌రావు, బాబూరావు తదితరులు తమ కాలనీని వర్క్ సెంటర్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలని సబితకు వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చాణక్యపురికాలనీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జోన్ మార్పిడికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చాణక్యపురికాలనీ ప్రతినిధులు విద్యాసాగర్, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సింహ పాల్గొన్నారు.

కళావతి స్మారక భవనం ప్రారంభం

సరూర్‌నగర్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లోని తిరుమలానగర్‌కాలనీలో అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం సొంత డబ్బుతో నిర్మించిన రామిడి కళావతి స్మారక భవనాన్ని ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను దూరంగా పెట్టి, వారి ఆలనా పాలనా పట్టించుకోని కొడుకులు ఉన్న ఈ రోజుల్లో తన తల్లి జ్ఞాపకార్థం రాంరెడ్డి సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ కవితారాంరెడ్డి, నాయకులు, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్పన్ డిబేట్‌లో నగర విద్యార్థికి ప్రథమస్థానం


నైతికసాయికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధ్యాపకులు

దిల్‌సుఖ్‌నగర్ : అమెరికాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్‌ఎస్‌ఎస్) ఇటీవల నిర్వహించిన స్పన్ డిబేట్ 2024లో దిల్‌సుఖ్‌నగర్ శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి జోగ నైతికసాయి ఆలిండియా లెవల్ ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థికి సన్మానసభను నిర్వహించారు. డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త మునగాల వెంకటనరేష్, పాఠశాల ఏజీఎం సతీష్ విద్యార్థిని సన్మానిస్తూ ప్రపంచ వ్యాప్తంగా 9దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా అందులో నైతికసాయి ప్రథమస్థానంలో నిలవడం నగరానికే గర్వకారణమని అభినందించారు. కార్పొరేటర్ జితేందర్, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, పాఠశాల డీన్ శ్రీను, నాసా ఇన్‌చార్జి ప్రణీత, ఐకాన్ ఇన్‌చార్జి పద్మజ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు : డీఈ


విద్యుత్ సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న డీఈ హన్మంతరెడ్డి

సైదాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తూ, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆస్మాన్‌ఘడ్ డివిజనల్ ఇంజనీర్(డీఈ) హన్మంతరెడ్డి సూచించారు. ఆదివారం ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి డీఈ పర్యటించి ఫీడర్లు, సబ్‌స్టేషన్లను పరిశీలించారు. 11కేవీ విద్యుత్ ఫీడర్ సర్వేను కొత్తగా అమలులోకి వచ్చిన యాప్ ద్వారా నిర్వహించి వివరాలు సేకరించారు. విద్యుత్ ఫీడర్లు, బ్రేకర్లు, ఏబీ స్విచ్‌లు, బ్యాటరీ ఛార్జర్లు వంటి పరికరాల పనితీరును కూలంకుషంగా పరిశీలించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లుల చెల్లింపులలో సమస్యలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు ఏర్పడితే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈలు, ఏఈలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య శిబిరాలు

చాదర్‌ఘాట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాలు నడపండి, నడిపించండి అనే నినాదంతో ప్రారంభమైన శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు కె. నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం శాలివాహననగర్ పార్క్‌లో శాలివాహన వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైద్య పరీక్షతో పాటు వాకర్లకు మానసిక ఉల్లాసం కోసం విహారయాత్రలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి రాంరెడ్డి జరిగిన కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. సమావేశంలో క్లబ్ కోశాధికారి యాదయ్యయాదవ్‌తో పాటు మాజీ డిస్ట్రిక్ గవర్నర్లు, క్లబ్ మాజీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో ఉచిత వైద్య శిబిరం

సరూర్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రైట్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బడంగ్‌పేట్ కౌన్సిల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాదర్‌గుల్‌తో పాటు పరిసర కాలనీలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఆదర్శ ఫౌండేషన్ చైర్మన్ జీ.అనితారెడ్డి, కార్పొరేటర్లు నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, గూడెపు ఇంద్రసేన, బ్రైట్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్


బీజేవైఎం నేతలను ముందస్తు అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించిన పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పలువురు బీజేవైఎం నేతల్ని ముందస్తు అరెస్టులు చేశారు. డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని నిరుద్యోగులు శనివారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో ఆకస్మిక నిరసన చేపట్టిన నేపథ్యంలో వారికి మద్దతుగా బీజేవైఎం నేతలు ఆందోళనలు చేయనున్నారన్న సమాచారం మేరకు ముందస్తు అరెస్టులు చేపట్టారు. ఇందులో భాగంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు రంజిత్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బెంగరబోయిన సురేష్ ముదిరాజ్, ఎల్బీనగర్ బీజేవైఎం కన్వీనర్ రాకేష్‌యాదవ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు గన్‌గమ్ నవీన్, సురేష్, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, సురేష్, బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధు ముదిరాజ్, శ్రీధర్, రాజేష్, వివేక్‌రెడ్డి, టింకు, రఘునందన్ జోషి, గిరీష్‌గౌడ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి స్టేషన్‌కు వెళ్లి వారిని విడుదల చేయాలని ఇన్‌స్పెక్టర్‌ను విన్నవించారు.

బస్సులో బంగారు ఆభరణాల చోరీ

- ఓయూ పీఎస్‌లో జీరో ఎఫ్‌ఐఆర్.. ఎల్బీనగర్‌కు బదిలీ

కొత్తపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): రెండున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బస్సు ప్రయాణికురాలు ఓయూ పీఎస్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఓయూ పీఎస్‌లో జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును శనివారం ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్ సిరీస్ రోడ్డులో వాస్తుకాలనీలో ఉండే గృహిణి ఎస్.పద్మలత(45) గురువారం మల్లాపూర్ సూర్యనగర్ కాలనీకి వెళ్లి రెండున్నర తులాల బంగారు ఆభరణాలను రీమోడల్ చేయించుకుని ఆటోలో హబ్సిగూడకు వచ్చింది. అక్కడి నుంచి టీజీఆర్టీసీ 290 బస్సులో కామినేని చౌరస్తాకు చేరుకుని, బస్సు దిగి కొంతదూరం నడిచి, తర్వాత బ్యాగు చూసింది. ఆభరణాలు కనబడలేదు. శుక్రవారం ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బీఎన్ఎస్ ప్రకారం వారు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

బంగ్లాదేశ్ నుంచి నగరానికి తీసుకొచ్చి.. బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి..

- పెళ్లి చేసుకుని భార్యతో దందా
- తప్పించుకొని పోలీసులను ఆశ్రయించిన యువతి

హైదరాబాద్ సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ యువతితో బలవంతంగా వ్యభిచారం చేస్తున్న ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి చెర నుంచి తప్పించుకున్న యువతి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బంగ్లాదేశ్ యువతిని రక్షించిన పోలీసులు ఆమెను హోమ్‌కు తరలించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. పూణెకు చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులు బంగ్లాదేశ్‌లో ఉండి అక్కడి యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత సముద్ర మార్గం గుండా రహస్యంగా ఇండియాకు తీసుకొచ్చి పుణెలో కాపురం పెట్టాడు. ఆమె పేరుతో ఆధార్‌కార్డు సైతం సృష్టించాడు. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల్లోనే అతనికి అప్పటికే పెళ్లయిన విషయం ఆ యువతికి తెలిసింది. దాంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఆమెను వదిలించుకోవాలని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఇక్కడ కిస్మత్‌పూర్‌లో తన తమ్ముడు షాకీర్ వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. తర్వాత షాకీర్ ఆ యువతిని భయపెట్టి లొంగదీసుకుని, ఢిల్లీకి చెందిన జాకీర్‌కు అమ్మేశాడు. జాకీర్ పుణెకు చెందిన మరో మహిళతో హైదరాబాద్‌లోనే ఉంటూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ యువతిని కూడా కొద్దిరోజులు నిర్బంధించి వ్యభిచార వృత్తిలోకి దింపాడు. ఆన్‌లైన్‌లో విటులతో బేరం కుదుర్చుకొని ఆటోలో తీసుకెళ్లి కస్టమర్స్ వద్దకు, హోటళ్లకు తిప్పేవాడు.

వచ్చిన డబ్బులు జాకీర్, పుణెకు చెందిన మహిళ తీసుకునేవారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ యువతికి, పుణె మహిళకు గొడవ జరిగింది. తెలుసుకున్న జాకీర్ యువతిని తీవ్రంగా కొట్టాడు. దాంతో ఆ యువతి వారి చెర నుంచి తప్పించుకొని స్థానికుల సహాయంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు జాకీర్, పుణె మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. వీరి వెనుక ఇంకా ఏదైనా ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి రైల్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీ

- జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన కాచిగూడ రైల్వే పోలీసులు

బర్కత్‌పుర, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన శీతల పానీయం ఇచ్చి బంగారు ఆభరణాలను, నగదును దొంగలు తస్కరించారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా వేంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి(72) తన భార్యతో కలిసి బెంగళూరులో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి శనివారం మియాపూర్‌లో నివాసముంటున్న కూతురి వద్దకు రావడానికి మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కాచిగూడకు వస్తుండగా రైల్లో ఇద్దరు అపరిచిత వ్యక్తులు పరిచయమై, లోయర్ బెర్తులను ఇచ్చారు. హిందూపురం రైల్వేస్టేషన్ సమీపంలో వెంకట్రాంరెడ్డి దంపతులు వారిని తినమని అరటి పండ్లు ఇచ్చారు. ప్రతిగా వారు మత్తు మందు కలిపిన శీతల పానీయాన్ని ఇచ్చారు. అది తాగిన భార్యాభర్తలు మత్తులోకి జారుకున్నారు. ఆదివారం రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చిన తర్వాత వారికి మేలుకువ వచ్చింది. లేచిచూడగా పక్కనే ఉన్న బ్యాగు కనిపించలేదు. దానిలో 80 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.2వేల నగదు ఉన్నాయి. బాధితులు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్‌ఐఆర్ కింద కేసు నమోదు చేసుకొని, హిందూపురం రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.